# కన్నె గులాబీలు

క్రమ్ముకుని వికసించిన గులాబీపూలు – ఎవరన్నా కోసుకుంటారేమోనని- ఎత్తుగా వున్న గోడలమీదుగా-కొమ్మ లెవరికీ అందవు. యౌవ్వనపు ముమ్మరంతో చూసిన వారిని సొమ్మసిల్లచేసే ఆ కొమ్మ కూడా ఎంద రెన్నివిధముల ఉవ్విళ్ళూరినా ఎవరికీ అందదు.

వెన్నెల రాత్రుల్లో చంద్రశాలా సవిధ సీమను తరంగితమయే గీతికారస

వాహిని కోసం చాలామంది కాచుకునీ వుంటారు. హాయిగా పాట విని, ఆ నవమోహిని పొరబాటునన్నైనా కనబడుతుందేమోనని ఎత్తిన తలలు వంచకుండా చూసి చూసి, భగ్న హృదయాలతో తిరిగి పోతూంటారు. కాని, ఆ అమ్మాయితో స్నేహం.... దర్శనం....

o o o

సుందరం మదరాసు ఎందుకు వచ్చాడో అతనికే తెలియదు. బయలుదేరినది అసలు ఎక్కడికో తెలియదు. కాని, చల్లగాలికి బీచివద్దకు చేరుకున్న తర్వాతనైనా రేడియో అవలంబనాన బొంగురు గొంతుతో అరవపాట వినబడేదాకా, తాను చివరకు అక్కడ తేలాననే విమర్శనే లేదు. చిత్ర శోభలు లేని సామాన్య సాంసారిక జీవనం అతనికి నచ్చలేదు. కాంచన సమృద్ధి కలిగిన, కాంతాసమ్మతత్వము కలలోనైనా అనుభవించని యోగంచేత అర్థం చేసుకోలేని ఆవేదనతో సంతోషం తెప్పించుకోవాలని....దాన్ని వెదుక్కుంటూ, దోవ తెలియకుండా తిరుగుతున్నాడు.

పట్నంగూడా పాతబడిపోయింది నాలుగు రోజుల్లోనే అతనికి. ఏమీ తోచదు. కాలం గడపడానికి మార్గాలు కనిపించడంలేదు. స్నేహితుల మాట ఎత్తటంతోనే ఎక్కడలేని విసుపూ వచ్చేది. ఏదైనా రచించడానికి యత్నంచేసినా....మరల చదువుకునేటప్పటికి రసవిహీనంగా, జీవకళ కొరవడినట్టుగా తోచి, నిస్పృహతో వ్రాసిన వాటిని చించివేసేవాడు.

తోటివారందరూ ఎందుకు....ఎలా, సంతోషంగా వుండగలరో ఆతనికి అర్థమయ్యేది కాదు. తనకు ఏమి కావలెనో దేనిని అన్వేషించుచున్నాడో తెలియదు. ఎరుగున్నవాళ్ళు ఈ విపరీతపు ఆవేదనను, ప్రవర్తనను చూసి, కవికి అబ్బవలసిన లక్షణాలలో అది ఒకటని, లక్ష్యపెట్టకుండా ఊరుకునేవారు. క్రమంగా ఎవరి సహచర్యాన్నీ యిచ్చగింపకుండా ఒంటరిగా షికారు బయలుదేరటం మొదలుపెట్టాడు; కాని ఏమీ లాభం కనిపించడం లేదు. పార్థసారథి దర్శనం కోసం శుక్రవారంనాడు తయారయ్యే తమిళాంగనా పద్మవ్యూహాన్ని బలవంతాన భేదించుకుంటూ వెళ్ళే అవసరాల్లోనైనా అల్లుకుపోయిన అంత అందము కూడా, అతనిని లాలసుని చేసేది కాదు. వాల్చూపులూ, చిరునగవులూ లక్ష్యపెట్టడం అలవాటైంది కాదు.

o o o

మంచుతెరలు ఇంకా కమ్ముకుని వుండటంచేత ఎండ బాగా పురివిప్పలేదు.

సుందరం మైలాపూరులో — ఆ వీధినే నడిచి వెళుతున్నాడు. అక్కడికి.... ఆ మేడ ప్రాంతానికి వచ్చేటప్పటికి కొంచెం నెమ్మదిగా అడుగు వేశాడు - సమీపించి, ఆ చక్కదనాన్ని చూస్తూ సాపుగా ఆగిపోయినాడు.

కనపడ్డవి హిమానీ సంస్పర్శచేత రసార్ద్రిములైన గులాబీపూలు :

అవి పలుకరించినట్లుగా అయింది ఆతనికి. ప్రహరీవద్దకు వెళ్ళాడు. బరువుగా వుండడంచేత కొమ్మలు అందుబాటులోనే వున్నవి. పూలని - చూసి సంతోషిస్తూ నిలబడినాడు.

పూల దొంతరలమీదుగా - మేడమీద - ఆ అమ్మాయి—కనపడ్డది.

ఆ దృష్టితోనే ఆ పిల్లవంక చూసి, అక్కడ నిలువకుండా నడచిపోయినాడు.

మరునాడు....ఆ వేళకే....అక్కడికి వచ్చి, గులాబీల చిరునగవును గమనించాడు. ఊరుకోలేక, వాటిని కోమలంగా స్పృశించి, పరవశుడైనాడు. ఆ అమ్మాయి అందుబాటుగానే కనబడ్డది. కాని, చేయి చెప్పినమాట వినలేదు.... ముందుకు సాగలేదు.

నవోదయముతో కోరికలు విజృంభించినవి. తనని - తనకోసమే వికసించినవి - తనకు కావాలి అనుకున్నాడు: పూసిన పూలన్నీ....మొగ్గలను మాత్రము కనికరించి విడిచాడు.

కనబడకుండానే ఆ అమ్మాయి తోటలోనుంచి తీయని గొంతుతో "ఎవరు ఆలా కొమ్మలు లాగేది?" అని కసిరినట్టుగా అడిగింది.

అతడు ఆనవాలుపట్టి పులకితుడైనాడు. జవాబు ఏమీ చెప్పకముందే....ఏమి చెప్పాలో తెలియకముందే....ఆ అమ్మాయి కనిపించింది. గ్రీన్‌హౌస్ తిన్నెమీద నిలుచుని వున్నది. మొగం మాత్రము అగుపడుతూన్నది.

"ఎవరు....నీ....మీరు?"

సుందరం కొంచెం తటపటాయించి, "నే....ను" అన్నాడు.

ఆ అమ్మాయి, చిరునగవుతో చూసి....చూస్తూ ఊరుకున్నది....

"పూలు....కోసుకోవచ్చునా?" అని ఆతడు సిగ్గుపడుతూ ప్రశ్నించాడు.

నవ్వుతూ....ఆతనివంక చూస్తూనే "మొగ్గలు....కూడా కావలిసుంటే...." అని తనలో తాను నవ్వుకున్నది ఆమె.

సుందరం అమాయకంగా నవ్వుతూ గోడమీదికి....ఎగువకు....చేజాపి,

"ఇవి....మీరు....తీసుకోండి" - అని కోసిన పూలను అందీయబోయినాడు.

ఆమె వద్దని సైగతో బదులు చెప్పింది. చిన్నబోయి తరువాత కథ ఎలా నడపాలో తెలియక చూస్తూ నిలువబడి పోయినాడు. ఏమీ మాటాడలేదు ఆ అమ్మాయి. రోషంతో, అభిమానంతో వెనుదిరిగి నాలుగు అడుగులు వేసి....ఇక మనస్సు పట్టలేక మళ్ళా అక్కడికే తిరిగి వచ్చాడు.

ఇంకా అలాగే నిలువబడి వున్నది. అతని రాక చూసి బహుళార్థ సంభరితమైన అపాంగ వీక్షణ కటాక్షముతో దిగిపోయింది.

"వెన్నెల వస్తేనే కాని....జాజులు....వికసించవు...." అని ఆ అమ్మాయి పలుకులే విస్పష్టంగా వినవచ్చాయి.

ం ం ం

ఆ రోజంతా ఏలా గడిచిపోయిందో సుందరానికే తెలియదు. చంద్రుడికన్న తాను ముందుగా బయలుదేరడానికి పంతము పట్టినట్లు సహనమనే మాటే లేక పోయింది. కాని, మామ రాకతో కాని మనసులోని కోరికలు తీర్చేందుకు మా కుమారుడు కూడా ఆయత్తుడు కాడు గాదూ?

ఎవరినీ లక్ష్యం సేయనట్లు యకాయకిని రాచబాటను నిర్భయముగా తోటలో ప్రవేశించాడు సుందరం. ఎవరినీ కన్మొరగి రానవసరము లేని వైఖరిలో ఆమె సమీపించింది.

ఎవరు ముందు కౌగలించుకున్నారో, ఎంతసేపలా ఉండిపోయినారో.... ఎవరికీ తెలియదు. కాని ఆ అనుభవానంద ముద్రలో రేకలుగా విడిపోతూ, గులాబీలన్నీ సన్నజాజుల సైదోడున అవాఙ్మధుర ధోరణిలో 'అబ్బ!' అనినట్లయింది. విడని కౌగిలివి, విడువజాలని హృదయంతో, విడిపించుకుంటూ, ఆ అమ్మాయి కూడా "అబ్బ" అన్నది. అంత చక్కగా అనగలిగిన పెదవులను అతడు సత్కరించాడు.

"నేను....నీతో....మాటాడను" అన్నది ఆ అమ్మాయి.

సుందరం మరీ దగ్గరగా కదలి "పోనీలే...." అన్నాడు.

చిన్నపిల్లల మారాంలాగా — "నా....పూలన్నీ...." అని ఆ భంగిమం నిలుపలేక నవ్వేసింది.

"మరి....ఎందుకు మాటాడావు?"

ఇద్దరూ ఒకరిని చూసి ఒకరు....ఒకమారే కలసి నవ్వుకున్నారు.

తమ చెలిమి సఖిలషించలేదని కలువరిస్తూన్న జాజులతో తన నెచ్చెలివేణిని అలంకరించాడు. ఎంతో వెదికి మారుమూలల ఆకుల మాటున అణగి మణగి సిగ్గు పడుతూన్న ఒకటి రెండు అరవిచ్చిన గులాబీల జన్మ కూడా సార్థకం చేశాడు.

కాని, ఆ ప్రణయ సమ్మోహనంలో ఎంతకాలము అవి రేకలు విడకుండా నిలువగలవని చందమామ సర్వజ్ఞుడులాగా నవ్వుతూన్నాడు.

o o o

వెన్నెల పక్షపాతం వహించిన దోషాన సన్నగిలిపోయే రోజులు వచ్చినవి. మంచు చమకులతో ముత్తెపు తళుకు మాసిపోయిన తరువాత విరికన్నెలకు కూడా తొలిప్రాయము విరిసి పోయినది. గులాబీలకు మొదటి పరువము లేదు.

సుందరం రచనల్లో నవచైతన్యధుని పరవళ్ళు కొడుతూన్నది. కావ్యాత్మ అతని ఆలోచనలన్నీ సొంతం చేసుకుని మనసు జోలికి మరి వేనినీ రానీయడం లేదు.

మరిచిపోలేదు....లేడు; కాని మళ్ళా, ఆ అమ్మాయి కోసం కలువరించే అలసత్వం దరిజేరడం లేదు. ఆ సంతోషమంతా సంతోషముగానే ఆగిపోయింది....

ఆమె గీతికాలాపాల్లో మును మొలవని రసాంకురములు తలచూపుతున్నవి; కాని అతని చెలిమికి నిలుకడ తీసుకుని వచ్చే కవళికలు లేవు. తళుక్కుమని మెరసి నిలువకుండా మాయమయే చిన్నెలు లేవు. అందరికీ ఆప్యాయంగా కనబడుతుంది; కాని ఆశ లూరించదు.

ఒకరి నొకరు విడువమనుకుంటూనే విడనాలకుండానే - విడిపోయినారు.

o o o

గులాబీలు వృంతాల్ని వీడకుండానే వయస్సు కొనసాగించుకుని విడివిడిగా రేకలుగా రాలిపడుతూ జీవన సంధ్యను సమాచీనముగా చేసుకుంటున్న అనుభవజ్ఞులలో అప్పుడప్పుడు తాత్కాలిక విభ్రమాన్ని ప్రవర్తిల జేస్తూంటాయి. అవి కూడా ఎప్పటిలాగానే అందవు....అందుకోనీయవు—అలా ఉండిపోవాలిసిందే.